




నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 32

# విజయ రహస్యం

ఓ చదువరీ!

1940వ సంవత్సరం నించీ ఇప్పటి దాకా వచ్చిన తెలుగు సినిమాలలో, ఒకే ఒక్క గొప్ప తెలుగు చిత్ర రాజం ఏమిటని బేతాళుడు ప్రశ్నిస్తే, నువ్వు సమాధానం ఏం చెబుతావు?

తెలిసీ సరైన జవాబు చెప్పకపోతే బుర్ర ఢామ్మని పేలిపోతుందని అంటే, అప్పుడు మనం ఆ సినిమాలో ఈ క్రింద వ్రాసినవన్నీ ఉన్నాయా లేదా అని చూస్తాం.

వాటిల్లో ముఖ్యమైనవి... ఆ సినిమాలో కథ, కథనం, మంచి సాహిత్యంతో కలబోసిన సుమధురమైన సంగీతం, గాన పటిమ, తెలుగు భాషలోని అందాలను పలికించే చక్కటి సంభాషణా చాతుర్యం, కడుపుబ్బ నవ్వించే సున్నితమైన హాస్యం, చిన్నా పెద్దా ప్రతి పాత్రా తమ హావభావాలతో అలరించే గొప్ప నటనా చాతుర్యం, తెలుగు సంస్కృతిని కళ్ళకు కట్టినట్టు చూపించే సంఘటనలు, హృదయాలని ఆకట్టుకునేటట్టు కథని తెరకెక్కించిన దర్శకత్వ ప్రతిభ, అన్నిటికీ మించి ఒక ఉత్తమ చిత్రం ప్రజలకి అందించాలనే సంస్కారం, క్రియా దక్షతా వున్న నిర్మాతల తపన... ఇవన్నీ చూస్తాం. కొన్ని సినిమాల్లో ఇలాటివి కొన్ని మాత్రమే వుంటాయి, ఎన్నో సినిమాల్లో వీటిలో ఎన్నో వుండక పోవచ్చు. కానీ ఇవన్నీ వున్నవి చాల కొద్ది చిత్రాలు మాత్రమే, చేతి వేళ్ళ మీద లెఖ్ఖపెట్టవచ్చు. వాటిల్లో కూడా కాచి వడపోసి, ఒకే ఒక చిత్రం పేరు చెప్పమంటే మాటలా!

మీరే ఆలోచించండి! చూద్దాం మీ జవాబూ, నా జవాబూ ఒకటేనో కాదో!

0 0 0

ఏమాత్రం సరుకులేని కొడుకులూ, కూతుళ్ళూ, తమ్ముళ్ళకు వారసత్వంతో అమ్మా నాన్నలు తెలుగు సినిమా రంగంలో అవకాశాలు అప్పనంగా అందించే రోజులు కావవి. దురభిమాన కులక్షేత్రాల కాలం కాదది. ఏ రంగంలోనైనా సత్తా, సత్తువా వున్నవాళ్ళకే

అవకాశాలు. కష్టపడి పనిచేసేవాళ్ళకే ఫలితాలు. కళాతృష్ణ, సాంఘిక సంస్కారం, సామాజిక బాధ్యత చిత్రరంగంలోని వ్యాపార లక్షణాలలో భాగాలు మరి!

షావుకారు, పాతాళ భైరవి, పెళ్ళి చేసి చూడు, చంద్రహారం, మిస్సమ్మ, మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు, జగదేకవీరుని కథ, గుండమ్మ కథ.....

ఒకటి కాదు రెండు కాదు. విజయ పరంపరలు. ఒక దాని మీద ఒకటి. ఎన్నో! ఎన్నెన్నో!

ఈ విజయాల వెనుక వున్నది ఇద్దరు విజయసారధులు.

వారిద్దరూ నడిపిన 'విజయా పిక్చర్స్' అనే సంస్థ!

తెలుగు చిత్రసీమలోనే కాదు, భారత చిత్రసీమకే మూడు భాషల్లో అతి చక్కని ఎన్నో మంచి హిట్ చిత్రాలని అందించిన ఏకైక సంస్థ అది.

0 0 0



అనగా అనగా ఒక నాగిరెడ్డి, ఒక చక్రపాణి.

బి. నాగిరెడ్డి వ్యాపార దక్షతగల వ్యక్తి. ఆయనకి తోడు, నీడ చక్రపాణి. సాహిత్య కళా పిపాసి.

1912లో కడప జిల్లా పొట్టిమడి గ్రామంలో పుట్టిన బొమ్మిరెడ్డి నాగిరెడ్డి, చిన్నప్పుడే కుటుంబ వ్యాపార వ్యవహారాల్లో తలదూర్చారు. దరిమిలా ఆనాటి మద్రాస్ నగరంలో బి.ఎన్.కె. ప్రెస్ కొని, దాని నిర్వహణ బాధ్యత స్వీకరించారు.



చక్రపాణి 1908లో గుంటూరు జిల్లాలోని, తెనాలి తాలూకా ఐతానగరంలో జన్మించారు. తెలుగుతో పాటూ హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, బెంగాలీ సాహిత్యాలలో ప్రావీణ్యం సంపాదించారు. ఎన్నో శరత్ నవలల్ని తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగులో కథలూ, నవలలూ వ్రాశారు. 1940లోనే ధర్మపత్ని అనే బొంబాయిలో తీసిన తెలుగు చిత్రానికి మాటలు వ్రాశారు. నాగిరెడ్డి సోదరుడు బి.ఎన్.రెడ్డి తీస్తున్న 'స్వర్గసీమ' సినిమాకి మాటలు వ్రాయటానికి చక్రపాణిని మద్రాసు రప్పించారు.

అప్పుడే ఆయనకి నాగిరెడ్డితో పరిచయం అయింది.

అదే ఎన్నో దశాబ్దాల విజయాల కలయిక. తరతరాల తెలుగువారికి పండుగ దినం.

చక్రపాణి అనబడే ఆలూరి వెంకట సుబ్బారావు పిల్లలకి ఏదయినా కథల పత్రికని ప్రచురించాలని మార్గాలను వెదుకుతున్నాడు. నాగిరెడ్డి ఆయనతో చేయి కలిపాడు.

బి.ఎన్.కె. ప్రెస్ ప్రచురణగా 1947 జులైలో అలా ఆవిర్భవించింది చందమామ మాసపత్రిక. మొట్టమొదటగా తెలుగు, తమిళ భాషల్లో వెలువడి, తర్వాత కన్నడ, మలయాళం, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ, ఒరియా, అస్సామీ, గురుముఖి, సింధీ, సింహళీస్ మొదలైన పదమూడు భాషలకి విస్తరించింది.

ఇదేదో కలిసొచ్చిన అదృష్టం కాదు. దీనికి కారణాలు నాగిరెడ్డి వ్యాపార దక్షత, చక్రపాణి సాహిత్యాభిలాష. 1947లోనే 6000 కాపీలు అమ్ముడుపోయిన చందమామ, తర్వాత 40,000 కాపీల పైన అమ్ముడుపోయింది. భారతదేశంలో ఎన్నో ఇళ్ళల్లో చందమామ వెన్నెల కురిపించింది.

నాగిరెడ్డి - చక్రపాణి అస్తమించిన తర్వాత, నాగిరెడ్డి తనయుడు విశ్వనాథరెడ్డి చందమామని నడిపి నెలనెలా 5 లక్షల కాపీల పైన అమ్మకాలు పెంచారు. అమ్ముడుపోయిన ప్రతి కాపీని కనీసం 17మంది అయినా చదివేవారని ఆ రోజుల్లో అంచనా వేశారు! ఆ తర్వాత వారి చలువ వలనే యువ, విజయచిత్ర, వనిత మొదలైన పత్రికలు వచ్చాయి.

1949లో నాగిరెడ్డి మద్రాసులోని వాహినీ స్టూడియోని కొన్నారు. దానికి విజయా వాహిని స్టూడియోస్ అని పేరు పెట్టారు. అప్పుడే చక్రపాణితో సంబంధం బాగా దగ్గరవటంతో, ఆయన్ని భాగస్వామిగా చేసుకుని విజయా పిక్చర్స్‌ని స్థాపించారు.

విజయావారి విజయ పరంపర 1950లో తీసిన షావుకారు సినిమాతో మొదలయింది. నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి ఇంటింటికి తెలిసిన పేరయిపోయింది. బాపూ-రమణలలా, ఇద్దరు వ్యక్తులయినా ఒకరు లేకుండా ఇంకొకరు లేరు అనే వరకూ వెళ్ళింది వారి స్నేహం. నాగిరెడ్డి సినిమా వ్యాపారం చూసుకుంటే, చక్రపాణి చిత్రానికి కావలసిన కథా, నటీనటులూ, సాహిత్యం, సంగీతం అన్నీ దగ్గరుండి చూసుకునేవారు. ఎక్కడా, ఎన్నడూ ఇద్దరిమధ్యా పొరపొచ్చాలు వచ్చినట్టు లేదు. ఇద్దరూ ఒకే రకమైన విలువలకు పట్టం కట్టారు. అదేనేమో వారి విజయ రహస్యం.

0 0 0

షావుకారు సినిమాతో జానకి పరిచయమే కాక, ఆవిడ పేరే షావుకారు జానకి అయిపోయింది. ఆ చిత్రంలోనే యస్వీ రంగారావు ఒక చిన్న పాత్రలో కనిపించటం విశేషం. షావుకారు చిత్రంలో ఘంటసాల పాడిన 'పలుక రాదటే చిలుకా' గుర్తుందా? అంత మధురమైన పాటని ఎలా మరిచిపోతాం!

తర్వాత 'తోటరాముడు' ఎన్టీరామారావుని నటుడిని చేసినది పాతాళభైరవి చిత్రం. నేపాళ మాంత్రికుడిగా యస్వీ రంగారావులోని నటనా కౌశలాన్ని వెలికి తీసిన చిత్రం 'పాతాళభైరవి'. ఆయన చెప్పిన మాటలు, 'సాహసం సేయరా డింభకా! రాజకుమారి దక్కుతుంది' చాలమందికి ఇంకా గుర్తుండే వుంటాయి. కెవిరెడ్డి దర్శకత్వ ప్రతిభ కనపడుతూనే వుంటుంది. చందమామ పత్రికలో వచ్చిన సీరియల్ కథ ఆధారంగా ఆ చిత్రం తీయటం ఒక విశేషం.

ఎల్వీప్రసాద్ దర్శకత్వంలో వచ్చింది పెళ్ళిచేసిచూడు. ఈ చిత్రంలోని హాస్యం, మాటలూ, పాటలూ మరువ లేనివి.

నాగేశ్వరావు, రామారావు, రంగారావు, సావిత్రి, జమున, రేలంగి, రమణారెడ్డి లాటి ఉద్ధండులతో తీసిన మిస్సమ్మ. రాజేశ్వరావు సంగీతంలో రాజా, జిక్కి పాడిన పాటలు ఈనాటికీ మనం ఆనందిస్తూనే వున్నాం. ఇది కూడా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలోనే వచ్చింది. ఈ చిత్రం అన్ని విజయావారి చిత్రాల మాదిరిగానే తమిళంలోనే కాక హిందీలో కూడా వచ్చింది. జెమినీ గణేషన్ని తమిళ సినిమాల్లో నిలబెట్టిన చిత్రం ఇది.

1957లో కెవిరెడ్డి దర్శకత్వంలో వచ్చింది, ఆనాటికీ ఈనాటికీ ఏనాటికీ గొప్ప చిత్రమైన మాయాబజార్. రామారావు, నాగేశ్వరావు లాటి మేటి నటుల్ని పక్కకు నెట్టి యస్వీ రంగారావు హీరోగా నటించిన చిత్రం. సావిత్రిలో మహానటిని చూపించిన చిత్రం.

సియస్సార్ని చూసిన తర్వాత, శకుని పాత్రకు ఆయన తప్ప ఇంకెవరూ పనికిరారన్నారు. ఆ చిత్రంతో ఎంతో మంది హాస్య నటులు చిత్రరంగంలో నిలదొక్కుకున్నారు.

సంగీత సాహిత్యాల్లో మణిదీపం. ఘంటసాల సంగీతం, పింగళి నాగేంద్రరావు గీత రచన, ఘంటసాల, లీల, సుశీల, మాధవపెద్ది ప్రభృతుల గానం ఈ నాటికీ ఇంటింటా వినిపిస్తూనే వుంటాయి. లాహిరి లాహిరి లాహిరిలో, చూపులు కలిసిన శుభవేళ, అహ నా పెళ్ళంట, నీ కోసమే నే జీవించునది, భళిభళిభళి దేవా, సుందరి నీ వంటి దివ్య స్వరూపమ్ము, వివాహ భోజనంబు, విన్నావ యశోదమ్మ మొదలైన పాటలతో పాటూ, ఎన్నో పసందైన పద్యాలు... అవి గుర్తు తెచ్చుకుంటుంటేనే ఒళ్ళు పులకరిస్తుంది.

అలాగే అప్పుచేసి పప్పుకూడు. మళ్ళీ సావిత్రి, జమున, రంగారావు, రామారావు, సియస్సార్, రేలంగి,

రమణారెడ్డిలతో పాటు జగ్గయ్య. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం.

తర్వాత సూర్యకాంతం ప్రధాన పాత్రగా వచ్చింది గుండమ్మకథ. రంగారావు, రామారావు, నాగేశ్వరావు, రేలంగి, రమణారెడ్డి, హరనాథ్, సావిత్రి, జమున... ఇలా ఎంతోమంది మహానటులతో.

ఈ చిత్రంలోని ప్రతి పాటా గొప్ప పాటే. 'ఎంత హాయి ఈరేయి' సాహిత్యంలోనూ, సంగీతంలోనూ ఎంత హాయిగానో వుంటుంది, అలాగే 'ప్రేమయాత్రలకి బృందావనము', 'మౌనముగా నీ మనసు పాడిన', 'లేచింది మహిళా లోకం', 'కోలొ కోలోయన్న'... అన్ని మాటలూ మధురమైనవే. ఘంటసాల సంగీతం, పింగళి సాహిత్యం మరి!

సావిత్రి, యస్వీ రంగారావు విజయావారి సినిమాల్లో ఆస్థాన విద్వాంసులైపోయారు. అంతేకాదు జోగారావు, రేలంగి, రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, చదలవాడ కుటుంబరావు, శివరావు, బాలకృష్ణ, పద్మనాభం, వంగర, సూర్యకాంతం, గిరిజ మొదలైన హాస్య నటులు హాస్యానికే నిర్వచనం ఇచ్చిన చిత్రాలు ఎన్నో విజయావారు తీశారు.

విజయావారి షావుకారు, పెళ్ళి చేసి చూడు, చంద్రహారం, మిస్సమ్మ, గుండమ్మ కథలకు రచన చేసింది చక్రపాణి. మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు లాటి ఎన్నో చిత్రాలకి చిత్రానువాదం చేసింది చక్రపాణి. అంతేకాక శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్, అరస కత్తిళి (తమిళ్), మనితన్ మరవిళ్ళైయ్ (తమిళ్) చిత్రాలకి దర్శకత్వం వహించిందీ చక్రపాణే.

విజయావారి చిత్రాల్లో హాస్యం చక్రపాణినించే వచ్చిందంటారు. ఆయన స్వతహాగా హాస్య ప్రియుడు.

ఒక నటుడికి చక్రపాణి వత్తుల డబ్బా బహుమానంగా ఇచ్చారుట. అతను ఆశ్చర్యపోయి అదేమిటని అడిగితే, ఈ వత్తుల డబ్బాని గుర్తుపెట్టుకుని, తెలుగు డైలాగులు చెప్పేటప్పుడు ఒత్తులు సరిగ్గా పలుకుతావని అని అన్నారుట. మరి ఈ రోజు మన నటీ నటులకి, సారీ తారలకి, ప్రతి రోజూ కనీసం ఒక వత్తుల డబ్బా ఇవ్వాలేమో!

చంద్రహారం సినిమా అంత బాగా ఆడలేదెందుకని అంటే, చక్రపాణి జవాబు - 'ఆ సినిమాకి జనం వచ్చింది రామారావుని చూడటానికి. సగం సినిమాలో అతను నిద్ర పోతూనే వుంటాడు మరి. అందుకని'

'మీ చిత్రాల్లో సందేశం వుండదండీ' అని ఒక విమర్శకుడు అంటే 'సందేశమే కావాలంటే, ఒక టెలిగ్రాం ఇవ్వచ్చు కదా, సినిమా తీయటమెందుకు' అంటారు చక్రపాణి.

0 0 0

'దాదా సాహెబ్ ఫాల్కే' పురస్కార గ్రహీత నాగిరెడ్డిని, తమిళ్‌నాడు ప్రభుత్వం కలైమామణిగా సత్కరించింది. చక్రపాణితో కలిసీ, విడిగానూ 22 చిత్రాలను తెలుగు తమిళ్ హిందీ భాషలలో నిర్మించారు. కొన్ని సినిమాలకు ఎడిటర్‌గా పనిచేశారు. 'ఎంగ వీట్టు పెన్' అనే తమిళ సినిమాకి దర్శకత్వం వహించారు.

వ్యాపారపరంగా బిఎన్‌కె ప్రెస్, విజయా-వాహినీ స్టూడియోలతో పాటు నాగిరెడ్డి విజయా కలర్ లాబ్, విజయా హాస్పిటల్స్‌నీ మద్రాసులో స్థాపించి, నిర్వహించారు.

చక్రపాణి 1975లో సెప్టెంబర్ 24న పరమపదించారు.

ఆయన పోయాక, నాగిరెడ్డి చిత్ర నిర్మాణంలో నించీ తప్పుకున్నారు.

2004లో ఫిబ్రవరి 25న, నాగిరెడ్డిగారు కూడా మిత్రుడూ, సన్నిహితుడూ, వ్యాపారంలో భాగస్వామీ అయిన చక్రపాణిగారి దగ్గరకు వెళ్ళిపోయారు.

0 0 0

విజయావారి మహోన్నత విజయాల వెనుక వున్న రహస్యం రెండు మాటల్లో చెబితే సరిపోతుంది.

నాగిరెడ్డి. చక్రపాణి.

0 0 0

